‘మీసేవ’ సేవలు సులభతరం

- అదనపు సేవలకు అవకాశం
- కొత్తగా మరో 9 రకాల సర్వీసులు
- వివాహ రిజిస్ట్రేషన్, మార్కెట్ వ్యాల్యూ సర్టిఫికెట్ల జారీ



కేటీదొడ్డి మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం మీసేవ కేంద్రాల ద్వారా సేవలను మరింత విస్తృతంగా చేసేందుకు శ్రీకారం చుట్టింది. అదనపు సేవలు వినియోగదారులకు సులభతరం చేసేందుకు అవకాశం కల్పించింది. కాగిత రహిత పాలనకు సేవలందిస్తున్న మీ సేవలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. మీసేవ ద్వారా ఇప్పటికే పలు రకాల ప్రయోజనాలు అందుతుండగా మరో 9 రకాల సేవలను మీ సేవలో పొందుపరిచారు. ఇకపై వివాహ రిజిస్ట్రేషన్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ జారీకి నిర్ణయించింది. ఇందులో భాగంగా సంబంధిత స్లాట్ బుకింగ్ వ్యవస్థను ప్రారంభించింది.

అదనంగా 9 రకాల సేవలు

ప్రస్తుతం మీసేవ కేంద్రాలు రెవెన్యూ, మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ శాఖల సేవలందిస్తూ పలు ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తుంది. ఇటీవల రెవెన్యూ శాఖ నుంచి ఆరు రకాల సర్వీసులు, అటవీశాఖ నుంచి రెండు సర్వీసులు , ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సీనియర్ సిటిజన్ నుంచి ఒక సర్వీసును ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రెవెన్యూ శాఖ నుంచి గ్యాప్ సర్టిఫికెట్, నేమ్ చేంజ్ ఆఫ్ సిటిజన్, లోకల్ క్యాండిడేట్ సర్టిఫికెట్, మైనార్టీ ధ్రువీకరణ సర్టిఫికెట్ కులం, ఆదాయం, క్రిమిలేయర్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్, అటవీశాఖ నుంచి వన్యప్రాణులతో చంపబడిన మానవ పశువులకు పరిహారం దరఖాస్తులు, సామిల్, టింబర్ డిపో ఫ్రెష్, రెన్యూవల్‌కు సంబంధించిన దరఖాస్తులు, డబ్ల్యూసీడీ, సీఎస్ నుంచి సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ మానిటరింగ్ సిస్టం దరఖాస్తులు మీసేవలోకి నూతనంగా 9 రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. అప్లికేషన్ కాగితాలతో ఇకపై కార్యాలయాలకు వెళ్లకుండా మీసేవలోనే దరఖాస్తు చేసి మీసేవ ద్వారానే నిర్ణీత గడువులోగా సర్టిఫికెట్లు పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.


మీసేవ కేంద్రంలో నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న ఈడీఎం శివ(ఫైల్)

మెరుగైన సేవలు



జిల్లాలోని 81 మీసేవ కేంద్రాల ప్రజలకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. 2011లో 10 రకాల సేవలతో ప్రారంభమైన ఈ కేంద్రాలు ప్రస్తుతం 350 రకాల సేవలందిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో 9 రకాల సేవలు అందుబాటులోకి రాగా మరో ఐదు రకాల సేవలను మీసేవలో పొందుపర్చారు. మీసేవ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– శివ, ఈడీఎం, గద్వాల

క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



కేటీదొడ్డి: ప్రతి ఒక్కరికీ బ్యాంకు సేవలపై అవగాహన ఉండాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ వీరన్న అన్నారు. శనివారం మండల పరిధిలోని ఇర్కిచేడు గ్రామంలోని జన సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంఎస్‌బీవై తదితర ఇన్సూరెన్స్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. పీఎంఎస్‌బీవై ఇన్సూరెన్స్ చేసుకున్న దేవమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమాచెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీ కౌన్సిలర్లు అనూష, ప్రకాష్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

క్యాతూర్ లిఫ్ట్‌కు తాళం



అలంపూర్ రూరల్: అలంపూర్ మండల పరిధిలోని క్యాతూర్ హరిహర ఎత్తిపోతల పథకం – 2 కు పాత కమిటీ చైర్మన్ తాళం వేశారంటూ శనివారం ఉదయం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లిఫ్ట్ తాళం తీయాలంటు రైతులు రావడంతో ఎస్ఐ వెంకటస్వామి రైతులతో మాట్లాడి లిఫ్ట్ తాళాలు తీయించి మోటార్లు ఆన్ చేశారు. సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

రాజోళి: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో శనివారం ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న మధు విద్యుత్ స్తంభం ఎక్కి లైట్లు సరిచేస్తుండగా షాక్ తగిలి పైనుంచి కిందపడి గాయపడ్డాడు. చేతికి తీవ్రగాయం కావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

పాఠశాలలో బాలసభ



అయిజ: మండలంలోని మేడికొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ‘బాలసభ’ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ రాములు హాజరై మాట్లాడారు. బాలల హక్కులు, వారి సమస్యలు, సమగ్రాభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన పెంచేందుకు బాలల సభ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



అయిజ: మండలంలోని బింగుదొడ్డి గ్రామంలో ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు ఉన్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ అన్నారు. శనివారం గ్రామస్తులతో కలిసి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను పరిశీలించారు. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఇళ్లపై వేలాడుతున్నాయన్నారు. అవసరమైనన్ని విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు భయాందోళనలో ఉన్నట్లు పేర్కొన్నారు.

విరివిగా మొక్కలు పెంచాలి



రాజోళి: విద్యార్థులు తమ చదువుతో పాటు నాటిన మొక్కలను కూడా పెరిగేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రాజయ్య అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి విద్యార్థులతో ముచ్చటించారు. ఇళ్లలో మొక్కలు నాటేలా అవగాహన కలిగించాలని పేర్కొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. అర్చకులు మధుసూదనాచారి, రవిచారి స్వామికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, కబ్జా బారి నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని బీజేపీ నాయకులు కోరారు. శనివారం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి మాట్లాడారు. మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా బుడగజంగాల కాలనీలో 936 సర్వే నంబర్‌లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. సదరు వ్యక్తికి వ్యవసాయం చేసుకోవడానికి 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఆ భూమిని ఇచ్చిందని, ఆ భూమిలో సాగు చేయకపోవడంతో కొన్ని సంవత్సరాల క్రితం ఆ వ్యక్తి పేరున ఉన్న ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు రద్దు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో కబ్జాదారుడు కోర్టుకు వెళ్లి నాకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు అన్యాయంగా లాక్కున్నారను, తిరిగి ఇప్పించండని కోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు తన పేరున మార్చక ముందే కబ్జాదారుడు మూడెకరాల భూమిలో బోర్లు పెట్టి ప్లాట్లు వేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆ భూమిలో మరం వేయడంతో బుడుగ జంగాల కాలనీ భారీ వర్షాలకు నీట మునుగుతుందని వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు స్పందించకుంటే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వెంకటేష్, వీరయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భోజనం నాణ్యత విషయంలో రాజీపడొద్దు


ఉమిత్యాలతండాలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

కేటీదొడ్డి: మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఫిర్యాదులు వస్తే సహించేది లేదని, నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ఉమిత్యాల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదన్న ఆరోపణ మేరకు ఎంఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడారు. భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వినోద్, సీఆర్పీలు యుగంధర్, పాపయ్య, విద్యా వలంటీర్ నరేష్, పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

గట్టు: విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కస్తూర్బా విద్యాలయాల జిల్లా సెక్టోరియల్ హంపయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో భోజన తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు పరీక్షించారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓ గోపిలత, ఉపాధ్యాయులు రేణుక, నిఖిల, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

బీసీ వ్యతిరేక పార్టీలను గద్దె దింపాలి


సమావేశంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు

ఎర్రవల్లి: బీసీ వ్యతిరేక రాజకీయ పార్టీలను గద్దె దింపాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. రిజర్వేషన్ల పెంపుతో బీసీలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపు నిర్ణయం తీసుకుందని విమర్శలు చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్ల పెంపు వల్ల బీసీ సమాజం తమ నాయకులను పార్లమెంట్, అసెంబ్లీలోకి ప్రజాప్రతినిధులను ఎన్నుకోలేరన్నారు. 42 శాతం రిజర్వేషన్ల పెంపు ద్వారా ఎన్నికయ్యే పదవులు జిల్లా కలెక్టర్ తొలగిస్తే పోయే పదవులని మండిపడ్డారు. అధికారులు తొలగిస్తే పోయే పదవుల వల్ల బీసీ సమాజానికి ఏ విధంగా న్యాయం జరుగుతుందో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బీసీ సమాజంపై ప్రభుత్వం కపట ప్రేమను చూపిస్తూ.. వారిని నష్టపరిచే విధంగా అవలంభిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు రాములు, దేవన్న, తిమోతి, కృష్ణ, గోపాల్, రామచంద్రుడు, తదితరులు ఉన్నారు.

వర్షాలు కురవాలంటూ ప్రత్యేక పూజలు


మానవపాడులో పూజలు చేస్తున్న భక్తులు

మానవపాడు: మండలంలోని జల్లాపురం, మానవపాడు గ్రామాల్లో శనివారం వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ, తుంగభద్ర నీటితో గ్రామ దేవతలు, ఆంజనేయస్వామికి అభిషేకాలు చేశారు. ఉపవాస దీక్షలు చేపట్టి అన్నదానం చేశారు.


వెంకటాపురంలో కాడెద్దులతో వెళ్తున్న రైతులు

కాడెద్దులతో తుంగభద్రకు

అయిజ: మండలంలోని వెంకటాపురం గ్రామంలోని రైతులు కాడెద్దులతో తుంగభద్ర నదికి చేరుకొని వర్షం కోసం ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర జలాలను బిందెల్లో తీసుకొచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకాలు చేశారు.

ధర్నా విజయవంతం చేయాలి

ఇటిక్యాల: విద్యా రంగంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 5న జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కిరణ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఓపీఎస్ విధానం తదితర సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి



రాజోళి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. శనివారం మండలంలోని ముండ్లదిన్నె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల కోసం అవసరమైన ఇసుక ఆన్‌లైన్ ద్వారా అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. డ్రెయినేజీని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వరి, పెద్దింటి నాగేష్, దేవరాజు, ఆంజనేయులుగౌడ్, దస్తగిరి, బాబు, విజయు తదిదరులు పాల్గొన్నారు.

చదువుకు ప్రాధాన్యం



ధరూరు: సమాజంలో చదువుకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని రేవులపల్లిలో బడికి హాజరుకాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలలో ఉండాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తోందని, సాధ్యమైనంత త్వరగా పిల్లలను బడికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిమ్మారెడ్డి, నాగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

గద్వాల: ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నోటిఫికేషన్లు విడుదల చేసి ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించిన జాబ్ క్యాలెండర్లకు ఏడాది కాలం గడచిపోయినా ఇంత వరకు ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకపోవడం శోచనీయమని బీఆర్ఎస్వీ నాయకుడు కురువ పల్లయ్య మండిపడ్డారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయం వద్ద నిరుద్యోగులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన చేశారు. గ్రూప్– 1, 2, 3, 4 ఉద్యోగాలను భర్తీ చేయలేదని, అదే విధంగా 25 వేలతో మెగా డీఎస్సీ, డీఎల్, జేఎల్ పోస్టులు భర్తీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకారం ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయాలని, లేని పక్షంలో నిరుద్యోగులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యువరాజ్, మహేష్, మహాదేవ్, మాధవ్, కిరణ్, సాయి, చక్రవర్తి, కృష్ణ, రంగస్వామి, ఈశ్వర్, కవిత తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీలో అభివృద్ధి శూన్యం


బురదమయమైన రోడ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రాజోళి: మున్సిపాలిటీగా ఏర్పడ్డాక కూడా రోడ్ల తీరు మారడం లేదని వడ్డేపల్లి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. పట్టణంలోని 9 వార్డులో శనివారం బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. మున్సిపాలిటీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. అభివృద్ధి మాత్రం జరగడం లేదన్నారు. నేటి వరకు సీసీరోడ్లు లేకపోవడం దారుణమని, దీనికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. కనీసం రోడ్లపైన కూడా దృష్టి పెట్టకుండా అబద్ధపు హామీలతో పబ్బం గడుపుతున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీరోడ్లు లేకపోవడంతో రోడ్లపై బురద ప్రవహించడం, వర్షపునీరు నిలిచి గుంతలు ఏర్పడి, దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి రోడ్లపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, వెంకటేశ్వర్లు, మోహన్‌యాదవ్, శేఖర్ ఆచారి, రవి, అయ్యరాజు పాల్గొన్నారు.

పంచాయతీ అవార్డుకు పోటీ పడాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మావతి

అలంపూర్: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ అవార్డుకు పోటీ పడాలని ఎంపీడీఓ పద్మావతి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పంచాయతీల 2.0 అవార్డుల పోటీ జరుగతున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి అవార్డుకు సంబంధించిన తొమ్మిది థీమ్స్ క్వశ్చన్ ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. లైన్ డిపార్మెంట్ నుంచి వచ్చే తేదీలను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. నమోదు చేసిన డేటాను సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్‌కు పంపించాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి


ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మల్దకల్: మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే సామాజిక తనిఖీకి ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు సహకరించాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన పనులకు సంబంధించిన పూర్తి వివరాలపై సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు పనులు చేసిన ప్రదేశాలను పరిశీలించడంతో పాటు కూలీలతో వివరాలు సేకరించి గ్రామసభల్లో తెలియజేస్తారన్నారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడిన సామాజిక తనిఖీల్లో వెలుగు చూస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, ఏపీఓ సుజాత, డీఆర్పీ, ఎస్ఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


హైస్కూల్లో మెటీరియల్‌ను అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు


కేజీబీవీలో విద్యా సామగ్రి అందజేస్తున్న నిర్వాహకులు

మల్దకల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాలలో బోధన సామాగ్రిని హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు రత్నసింహారెడ్డి పంపిణీ చేశారు. శనివారం ఆయా పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులకు తమ వంతు సహాయంగా బోధన సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ టీచర్లుగా తీసుకోవాలని వినతి


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: అంగన్‌వాడీ టీచర్లను ప్రీ ప్రైమరీ టీచర్లుగా తీసుకోవాలని అంగన్‌వాడీలతో కలిసి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను కోరారు. శనివారం హైదారాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో గద్వాల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ సభ్యులతో కలిసి వినతి పత్రం అందజేశారు. 50 సంవత్సరాలుగా అంగన్‌వాడీ ఉద్యోగులుగా గౌరవ వేతనంతో పనిచేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా అనేక అదనపు ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అంగన్‌వాడీలు తెలిపారు. ప్రభుత్వం ఇటీవలి ప్రవేశపెట్టిన ప్రీప్రైమరీ పాఠశాలల నిర్వాహణ కోసం ఇతర వాలంటీర్లను నియమించడం కోసం జీవోను విడుదల చేసిందని, దీంతో తామంతా రోడ్డున పడుతామని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు డిగ్రీలు, పీజీలతో పాటు, ప్రీస్కూల్ ట్రైనింగ్, జాబ్ కోర్సు, ఆర్పీ ట్రైనింగ్‌లు వంటివాటిపై పూర్తి అవగాహన ఉన్నందున అంగన్‌వాడీల్లో అర్హులైన వారికి ఉద్యోగాలు కల్పించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో సౌదామిని, ఇందిర, శ్రీలత, అనంతలక్ష్మి, సువర్ణ, వెంకటలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే ప్రధాని లక్ష్యం


అయిజలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు రామచంద్రారెడ్డి


క్యాతూర్ రైతువేదికలో పీఎం సందేశాన్ని వీక్షిస్తున్న అధికారులు, రైతులు

ఎర్రవల్లి: రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రధాని మోదీ లక్ష్యమని బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని సందేశాన్ని రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం ద్వారా రైతులకు ప్రతి ఏటా రూ.6 వేలు అందిస్తుందన్నారు. దీంతో పాటు రైతులకు సబ్సిడీ ద్వారా ఎరువులు, ఫసల్ బీమా యోజనా ద్వారా పంటలకు బీమా, గిట్టుబాటు ధర వంటి పథకాలు కేవలం నరేంద్ర మోదీ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మల్లేష్, హరి, శివ, వంశీ, గోవిందు, రైతులు పాల్గొన్నారు.

రైతువేదికల్లో సమావేశం

అలంపూర్ రూరల్: అలంపూర్ మండల పరిధిలోని క్యాతూర్, లింగన్‌వాయి గ్రామ రైతువేదికల్లో వీసీ ద్వార పీఎం మోదీ సందేశాన్ని రైతులు వీక్షించారు. పీఎం కిసాన్ 20వ విడతలో భాగంగా రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయడం గురించి జరిగిన ప్రత్యక్ష ప్రసారంలో అధికారులు , రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఓ నాగర్జున, ఏఈఓలు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని రైతుల పక్షపాతి

అయిజ: ప్రధాని నరేంద్రమోదీ రైతుల పక్షపాతి అని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని కొత్త పంటలను, నూతన విధానంతో పండించి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భగత్‌రెడ్డి, వెంకటేష్, నాగరాజు, వీరయ్య, వెంకటేష్, రాజశేఖర్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.


ఎర్రవల్లిలో..